**నీలగిరి నిత్యపద్యం**
ఆటవెలది

దక్కనట్టివాని దిక్కులుచూచుచూ
బాధపడిననేమి ఫలములేదు
దక్కినట్టి దాని దర్జాగ బ్రతుకున
స్వీకరించ నీకు స్వర్గసమము

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక




**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.




సంచిక : 341 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం | 06-04-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


# ఉప్పల్‌లో సన్‌రైజర్స్‌కు నిరాశ..

- బోణీ కొట్టిన పంత్ టీమ్..!
- సన్ రైజర్స్‌పై లక్నో సూపర్ జెయింట్స్ విజయం
- ఉప్పల్‌లో జరిగిన మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో విక్టరీ
- అజేయ హాఫ్ సెంచరీతో జట్టును గెలిపించిన పంత్

**వరుసగా మూడో మ్యాచులో ఓడిన సీఎస్కే**




# న్యాయస్థానం పవిత్ర ఆలయం

## న్యాయం కోసం అందరూ వచ్చేది ఇక్కడికే

- ప్రార్థనా మందిరాలకంటే పవిత్రం : సీఎం రేవంత్‌రెడ్డి
- నేర్చుకోవడమే న్యాయవ్యవస్థకు దిక్సూచి
- బుద్వేలులో హైకోర్టు జోన్-2 భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన
- కార్యనిర్వాహక వ్యవస్థతో కలిసి పనిచేయాలి
- అప్పుడే రాజ్యాంగం సజీవం: సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

**రాజేంద్రనగర్**

రాజ్యాంగం సజీవంగా ఉండాలంటే న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థలు తమ లక్ష్యాల విషయంలో ఏకీభవించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చెప్పారు. న్యాయవ్యవస్థలో మౌలిక సదుపాయాలనేవి ఐచ్ఛికం కాదనీ, అత్యవసరమేననీ, వాటిని బలోపేతం చేయటం తప్పనిసరి అని అన్నారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వాలు తమ వంతు కృషిని కొనసాగిస్తున్నాయని ప్రశంసించారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ లోని బుద్వేల్‌లో రాష్ట్ర హైకోర్టు జోన్-2 భవన నిర్మాణ పనులకు సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి జస్టిస్ సూర్యాకాంత్ శంకుస్థాపన చేశారు.

-మిగతా 2 లో





# దద్దరిల్లిన గల్ఫ్..

- ఇంధన సదుపాయాలే లక్ష్యంగా ఇరాన్ భీకర దాడులు
- కువైట్‌లో పవర్, డీశాలినేషన్ ప్లాంట్లపై క్షిపణులు, డ్రోన్ల వర్షం
- బహ్రెయిన్‌లో ఆయిల్ రిఫైనరీపై దాడి.. పెద్ద ఎత్తున మంటలు
- యూఏఈలో పెట్రో కెమికల్ ప్లాంట్‌పైనా విరుచుకుపడ్డ ఇరాన్
- ఇజ్రాయెల్‌లో డ్రోన్ల ఫ్యాక్టరీ ధ్వంసం
- ఇరాక్‌లో అమెరికా ఎంబసీలపై ఇరాన్ మద్దతు గ్రూపుల దాడి

**టెహ్రాన్,**

పశ్చిమాసియా యుద్ధం రోజురోజుకూ ఉధృతమవుతున్నది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలకు ఇరాన్ ఏమాత్రం తలొగ్గడం లేదు. ఇరాన్ దాడులతో ఆదివారం గల్ఫ్ దేశాలు దద్దరిల్లాయి. ఆయా దేశాల్లోని ఇంధన సదుపాయాలే లక్ష్యంగా ఇరాన్ విరుచుకుపడింది. కువైట్, యూఏఈ, బహ్రెయిన్‌లపై డ్రోన్లు, క్షిపణుల వర్షం కురిపించింది. ఇజ్రాయెల్‌పైనా భీకర దాడులు చేపట్టింది. మరోవైపు ఇరాక్‌లోని అమెరికా దౌత్య కార్యాలయాలే లక్ష్యంగా ఇరాన్ మద్దతు గ్రూపులు దాడులు చేపట్టాయి.

**కువైట్‌లోని విద్యుత్, డీశాలినేషన్ ప్లాంట్లపై దాడి**

కువైట్‌లోని ప్రధాన విద్యుత్తు, డీశాలినేషన్ ప్లాంట్లపై ఇరాన్ డ్రోన్ దాడులకు దిగింది.

-మిగతా 2 లో



# హెర్ముజ్‌ను తెరవండి.. లేదంటే!

- పవర్ ప్లాంట్లు, బ్రిడ్జిలు పేల్చేస్తాం
- చమురు వనరులను స్వాధీనం చేసుకుంటాం
- ఇరాన్‌కు మరోసారి డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరికలు

**వాషింగ్టన్**

ఇరాన్‌తో యుద్ధంలో వరుస ఎదురు దెబ్బలు తగులుతుండటంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహనం కోల్పోతున్నారు. ఈ క్రమంలో ఆయన ఆదివారం ఇరాన్‌పై తీవ్ర పదజాలంతో హెచ్చరికలు చేశారు. హెర్ముజ్ జలసంధిని తెరువకపోతే ఇరాన్‌లోని పవర్‌ప్లాంట్లు, బ్రిడ్జిలను పేల్చివేస్తామని హెచ్చరించారు. ఇది యుద్ధంలో నిర్ణయాత్మక క్షణమని, మరో రెండు రోజుల్లో ఇరాన్‌పై దాడులను ఉధృతం చేస్తామని చెప్పారు. హెర్ముజ్‌ను తెరువాలంటూ ఇరాన్‌ను తీవ్ర పదజాలంతో దూషించారు. లేదంటే మీకు నరకం చూపిస్తానని హెచ్చరించారు. ఇరాన్‌తో చర్చలు కొనసాగుతున్నాయని, ఒప్పందం కుదరకపోతే తీవ్ర పర్యవసనాలు ఎదుర్కొనవలసి వస్తుందని స్పష్టంచేశారు.మరికొన్ని గంటల్లో ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. చర్చలు విఫలమైతే ఇరాన్‌లోని కీలక సదుపాయాలను పేల్చివేస్తామని, ఇరాన్ చమురు వనరులను స్వాధీనం చేసుకుంటామని పేర్కొన్నారు. 48 గంటల్లో హెర్ముజ్ తెరువాలంటూ తాను అల్టిమేటం జారీ చేసినా ఇరాన్ వెనక్కి తగ్గుతున్న సూచనలు కన్పించకపోవడంతో ట్రంప్ తాజా హెచ్చరికలు చేశారు. ఆదివారం గల్ఫ్‌లోని ఇంధన వసతులపై ఇరాన్ విరుచుకుపడింది.

-మిగతా 2 లో

# పశ్చిమ బెంగాల్‌లో మహా జంగిల్ రాజ్ ప్రభుత్వం..

- టీఎంసీ ప్రభుత్వం ప్రజా ధనాన్ని కొల్లగొడుతోంది
- అక్రమ చొరబాటుదారులకు మమత అండగా నిలుస్తోంది
- మాల్దా, సందేశ్‌కాలి ఘటనలు ఆమె ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం.
- టీఎంసీ ప్రభుత్వంపై మోదీ ఫైర్



**న్యూఢిల్లీ**

పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ఆధ్వర్యంలోని టీఎంసీ ప్రభుత్వం ప్రజా ధనాన్ని కొల్లగొడుతోందని విమర్శించారు ప్రధాని మోదీ. ఆదివారం ఆయన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కూచ్ బెహర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో మహా జంగిల్ రాజ్ నడుస్తోందన్నారు. టీఎంసీ పాలనపై మోదీ మండిపడ్డారు.పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వ పతనం ప్రారంభమైంది. అక్రమ చొరబాటుదారులకు మమత అండగా నిలుస్తోంది. మాల్దా, సందేశ్‌కాలి ఘటనలు ఆమె ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. బెంగాల్‌లో మహా జంగిల్ రాజ్ (ఆటవిక రాజ్యం) నడుస్తోంది. ప్రజా ధనాన్ని టీఎంసీ కొల్లగొడుతోంది. కానీ, మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడ్డ తర్వాత వారు దీనికి తగిన మూల్యం చెల్లించాల్సిందే. జనాభాలో మార్పుల కారణంగా ఒకవైపు మన నేలపైనే స్వేచ్ఛను కోల్పోతున్నాం. ఇంకోవైపు బీజేపీ ఉంది. సొంత నేలపై సగర్వంగా,

-మిగతా 2 లో

# విద్వేషం జొప్పిస్తున్న బీజేపీ

- అసోం సభలో రాహుల్ గాంధీ విమర్శ




# పశువులకు డైపర్లు!

- పాక్‌లో విచిత్ర ఘటనలు
- పశువుల పేడపై పన్ను తప్పించుకొనేందుకే

**ఇస్లామాబాద్:**

పాకిస్థాన్‌లో పేడ పన్ను దెబ్బకు విచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. బయో గ్యాస్ కార్యక్రమం కోసం 'సుత్రా పంజాబ్' పేరుతో పంజాబ్ సీఎం మర్యం నవాజ్ ప్రతి బర్రెకు దాని యజమాని రోజుకు రూ.30 పన్నుగా



-మిగతా 2 లో



# ఉద్యమంలా నీటి భద్రత

- 100 రోజుల స్పెషల్ డ్రైవ్ శ్రీ కాల్వలు, చెరువులు, చెక్ డ్యామ్‌లకు మరమ్మతులు
- సాగునీటి సంఘాలతో టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

**అమరావతి బ్యూరో :**

నీటి భద్రత సాధిస్తే.. అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్రాన్ని కరువు రహితంగా చేయటమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, రాష్ట్రంలో వేసవి కంటే ముందు 6 మీటర్లు, వర్షాకాలం సీజన్ పూర్తయ్యే నాటికి 3 మీటర్ల లోతులో భూగర్భ జలాలు అందుబాటులో ఉండాలని ఆయన నిర్దేశించారు. ఈ నెల 6వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే 'నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత' కార్యక్రమంపై సాగునీటి సంఘాలు, మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి ఆదివారం నాడు

-మిగతా 2 లో

## అబద్ధాల పునాదుల మీద గెలిచిన

# రేవంత్‌రెడ్డి

## కాంగ్రెస్ ప్రభుత్వం మీద తీవ్ర వ్యతిరేకత

- నన్ను బీఆర్‌ఎస్ నుంచి పంపించి ఐదేండ్లయ్యింది
- కోళ్ళ ఫారాలు కూల్చారు.. భూములు గుంజుకున్నరు
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



**హైదరాబాద్**

సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాల పునాదుల మీద గెలిచారనీ, ఆ అబద్ధాల పునాదుల మీదనే అయన పాలన కొనసాగిస్తున్నారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ఆదివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామిర్‌పేటలోని తన నివాసంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందనీ, మీడియాను మేనేజ్ చేస్తూ, పైకి బుకాయిస్తూ, దబాయిస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో దోచుకున్నదంతా కక్కిస్తా అని అప్పుడు రేవంత్‌రెడ్డి అనీ,

-మిగతా 2 లో




## నాదర్‌గుల్‌లో రూ.7వేల కోట్ల

# భూకుంభకోణం

- 373 ఎకరాల భూమిని తన్నుకుపోతున్న కాంగ్రెస్ పెద్దలు
- కబ్జా కంపెనీల వెనుక మంత్రి పొంగులేటి కుటుంబం
- అధికార పార్టీ నేతల ఆక్రమణలు హైడ్రాకు కనిపించడం లేదా?
- ఏవీ రంగనాథ్ చర్యలు తీసుకోకుంటే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో అక్కడికి వెళ్తాం
- మాజీమంత్రి హరీశ్‌రావు హెచ్చరిక

**హైదరాబాద్**

హైదరాబాద్‌లోని నాదర్‌గుల్‌లో రూ.ఏడు వేల కోట్ల విలువైన భూకుంభకోణం జరిగిందని బీఆర్‌ఎస్‌ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. అక్కడ సర్వేనెంబర్ 613 (కొత్త సర్వే నెంబర్ 119)లో ఉన్న 373 ఎకరాల ప్రభుత్వ భూమిని కాంగ్రెస్ పెద్దలు గద్దల్లా తన్నుకుపోతున్నారని అన్నారు. ఈ కుంభకోణం వెనుక ప్రభుత్వ పెద్దలు, మంత్రులున్నారని ఆరోపించారు. అందుకే రక్షకులే భక్షకులుగా మారారని ఆందోళన వ్యక్తం చేశారు.

-మిగతా 2 లో

## ఆర్సీబీతో మ్యాచులో 43 రన్స్ తేడాతో ఓటమి

- పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానానికి చేరిన ఆర్సీబీ

**న్యూఢిల్లీ**



డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు.. ఐపీఎల్ 2026లో అదరగొడుతోంది. వరుసగా రెండో మ్యాచులో గెలిచింది. ఆదివారం బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచులో 43పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో ఐపీఎల్ 2026 పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానానికి చేరింది. ఓటముల హ్యాట్రిక్ నమోదు చేసిన చెన్నై సూపర్ కింగ్స్.. టేబుల్‌లో అట్టడుగు స్థానాన్ని పదిలం చేసుకుంది. ఇక ఈ మ్యాచ్ ఫలితంతో ఐపీఎల్‌లో ఆర్సీబీ వరుసగా నాలుగో మ్యాచులో సీఎస్కేను ఓడించింది.

## హెర్ముజ్‌ను తెరవండి.. లేదంటే!

మొదటి తరువాయి

**టెహ్రాన్‌పై అమెరికా భీకర దాడులు**

ఇరాన్‌పై ఆదివారం అమెరికా భీకర దాడులు జరిపింది. ఈ దాడుల్లో ఇరాన్‌కు చెందిన కీలక మిలిటరీ నాయకులు మరణించినట్టు ట్రంప్ స్వయంగా ప్రకటించారు. 'టెహ్రాన్‌పై భీకర దాడులు జరిగాయి. ఇరాన్‌ను అవివేకంగా నడిపించిన అనేక మంది మిలిటరీ నాయకులు ఈ దాడుల్లో ప్రాణాలు కోల్పోయారు' అని ట్రూత్ సోషల్‌లో ఆయన రాసుకొచ్చారు. అయితే వారు ఎవరన్నది మాత్రం ఆయన వెల్లడించలేదు. దాడికి సంబంధించిన వీడియోలను కూడా ఆయన పోస్ట్ చేశారు. అయితే ట్రంప్ ప్రకటనపై ఇరాన్ స్పందించలేదు.

## పశ్చిమ బెంగాల్‌లో మహా జంగిల్ రాజ్ ప్రభుత్వం..

మొదటి తరువాయి

తలెత్తుకుని నిలబడగల ఆత్మవిశ్వాసాన్ని అందిస్తుంది. ఒకవైపు సిండికేట్ పాలనలో ఆస్తుల్ని కోల్పోతామనే భయం. ఇంకోవైపు తమ భూమిపై యాజమాన్య హక్కులు కల్పించగలదనే విశ్వాసం ఇవ్వగల పార్టీ" అంటూ బీజేపీ గురించి మోదీ చెప్పారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మోదీ తెలిపారు. అక్రమ చొరబాటుదారుల్ని రక్షించేందుకే మమతా బెనర్జీ ఆధ్వర్యంలోని ప్రభుత్వం 'సర్'ను అడ్డుకుంటోందని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని, ఈ ఎన్నికలు పశ్చిమ బెంగాల్ భవిష్యత్‌ను నిర్ణయిస్తారన్నారు. ఎన్నికల రోజు టీఎంసీకి భయపడవద్దని మోదీ ప్రజలను కోరారు. ఈ ఎన్నికలు బెంగాల్ ప్రజల్లోని భయాన్ని బయటకు తొలగిస్తాయని అభిప్రాయపడ్డారు. ఇటీవల జడ్జీలు, పౌరులు ఎలా ఇబ్బంది పడ్డారో ప్రజలు చూశారని మోదీ అన్నారు. బెంగాల్‌లో రెండు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఏప్రిల్ 23, 29 తేదీల్లో ఈ ఎన్నికలు జరుగుతాయి.

## పశువులకు డైపర్లు!

మొదటి తరువాయి

చెల్లించాలని ఆదేశించారు. పాకిస్థానీలు దీన్ని పేడ పన్నుగా పిలుస్తున్నారు. 168 పశువుల కాలనీల్లోని 50 లక్షల జీవాలపై ఈ పన్ను పడనుంది. పన్ను ద్వారా రూ.450 కోట్లను సమీకరించాలని ప్రభుత్వం భావిస్తున్నది. దీంతో కొందరు యజమానులు బర్రెలకు జీరో-వేస్ట్ ఆహారాన్ని అందిస్తున్నారు. మరికొందరు తమ పశువులకు డైపర్లు తొడగడం ప్రారంభించారు. 'పశువుల పేడపై పన్ను వేసినప్పుడు.. మనుషుల మలం పైనా పన్ను వేయకుండా ఉండరు' అనే మాటలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## నాదర్‌గుల్‌లో రూ.7వేల కోట్ల భూకుంభకోణం

మొదటి తరువాయి

ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములుగా ప్రకటించాలని ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు లేఖ రాస్తే నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి 2008లో ప్రభుత్వ భూములుగా అసెంబ్లీలో ప్రకటించి ఏపీఐఐసీకి అప్పగించారని గుర్తు చేశారు. కౌసల్య, మమత వంటి మహిళా రైతులు 40 ఏండ్లుగా ఆ భూమినే నమ్ముకుని బతుకుతున్నారని వివరించారు. వారికి రూ.ఐదు లక్షలు, రూ.పది లక్షలు ఆశ చూపి వెళ్లగొట్టాలని చూస్తున్నారనీ, బోర్లు, కంచెలను ధ్వంసం చేశారని అన్నారు. నాదర్‌గుల్ భూములు శివరాజ్ బహదూర్‌వేనని ఆయన చెప్పినా 2005లోనే ఆర్డీవో ప్రభుత్వ భూమి అని స్పష్టం చేశారని చెప్పారు. 2017లో హైకోర్టు కూడా ఇది ప్రభుత్వ భూమి అంటూ చెప్పిందన్నారు. ల్యాండ్ సీలింగ్ చట్టం ప్రకారం ఒక వ్యక్తికి 373 ఎకరాలుండే అవకాశం లేదనీ, అయినా 2016లో శివరాజ్ బహదూర్ ఆ భూములను ఆల్ఫా, ఒమేగా, యునిటెక్ కంపెనీలకు విక్రయించారని అన్నారు. చట్టంలోని సెక్షన్ ఎనిమిది, సెక్షన్ 17 ప్రకారం ల్యాండ్ సీలింగ్ డిక్లరేషన్ ఇవ్వకుండా భూములను అమ్మే హక్కు లేదన్నారు. ఆ విక్రయాలు చెల్లవనీ, ఇది సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో ఉంటుందని కందుకూరు ఆర్డీవో తేల్చిచెప్పారని గుర్తు చేశారు. ఆర్డీవో నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఆ కంపెనీలు హైకోర్టుకు వెళ్తే ఆర్డీవో నిర్ణయమే సరైనదనీ, ఆ భూముల క్రయవిక్రయాలు చెల్లవని సింగిల్ బెంచ్, డివిజన్ బెంచ్ స్పష్టం చేశాయని వివరించారు. అమ్మిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించిందన్నారు. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ వాళ్లు సుప్రీంకోర్టుకు వెళ్లారనీ, ప్రస్తుతం జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ ప్రసన్న ధర్మాసనం వద్ద ఆ కేసు మంగళవారం విచారణకు రానుందని అన్నారు. భూభారతి పోర్టల్‌లో చూసినా అది ప్రభుత్వ భూమి ప్రొహిబిటెడ్ ల్యాండ్‌గానే చూపిస్తోందని వివరించారు.

## ఉద్యమంలా నీటి భద్రత

మొదటి తరువాయి

టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇరిగేషన్, వ్యవసాయం, పంచాయతీరాజ్, అటవీ, పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా ఈ జల సంరక్షణ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సిఎం చంద్రబాబు సూచించారు. నీటి సంరక్షణ-జలవనరుల పరిరక్షణ అంశాలే అజెండాగా 100 రోజుల కార్యాచరణను ఆయన ప్రకటించారు. సాగునీటి సంఘాలు కేంద్రీకృతంగా యాక్షన్ ప్లాన్ అమలు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రాష్ట్రంలోని 60 వేల మంది సాగునీటి సంఘాల సభ్యులకు కార్యక్రమ నిర్వహణ చేపట్టే కీలక బాధ్యతలు అప్పగించారు. నీటి భద్రత అంశంలో ప్రజలను భాగస్వాములను చేయాలని, ఈ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మలచాలని దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు ఏప్రిల్ 6 నుంచి జులై 14వ తేదీ వరకు నాలుగు దశల కార్యాచరణను ముఖ్యమంత్రి ప్రకటించారు. ఏప్రిల్ 6 నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు పనుల గుర్తింపు, ఏప్రిల్ 16 నుంచి 20వ తేదీ వరకు గుర్తించిన పనులకు అనుమతులు, ఏప్రిల్ 21 నుంచి జులై 9వ తేదీ వరకు పనులను చేపట్టడం, జులై 10 నుంచి 14వ తేదీ వరకూ పూర్తి చేసిన పనులకు సంబంధించిన నివేదికల సమర్పణ ఉండాలని సూచించారు. రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో స్టీరింగ్ కమిటీ విధానపరమైన అంశాలను పర్యవేక్షించాలన్నారు. సాగునీటి సంఘాలు దీనికి చోదక శక్తిగా ఉండాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,697 గ్రామాల్లో భూగర్భ జలాల ఎద్దడి ఉన్నట్టు గుర్తించామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

# ఉప్పల్‌లో సన్‌రైజర్స్‌కు నిరాశ..

**-బోణీ కొట్టిన పంత్ టీమ్..!**
**-సన్ రైజర్స్‌పై లక్నో సూపర్ జెయింట్స్ విజయం**
**-ఉప్పల్‌లో జరిగిన మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో విక్టరీ**
**-అజేయ హాఫ్ సెంచరీతో జట్టును గెలిపించిన పంత్**

**న్యూఢిల్లీ**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025లో రిషభ్ పంత్ సారథ్యంలోని లక్నో సూపర్ జెయింట్స్ బోణీ కొట్టింది. ఆదివారం సన్ రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచులో 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 157 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నో సూపర్ జెయింట్స్‌ను కెప్టెన్ రిషభ్ పంత్ ఆదుకున్నాడు. అజేయ హాఫ్ సెంచరీతో మరో బంతి మిగిలి ఉండగానే జట్టును గెలిపించాడు. ఈ ఓటమితో సన్ రైజర్స్ మూడు మ్యాచులలో రెండో ఓటమిని చవిచూసింది. 157 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నో సూపర్ జెయింట్స్‌కు ఓపెనర్లు ఎయిడెన్



మార్క్రమ్ (45), మిచెల్ మార్ష్ (14) మంచి ఆరంభాన్ని ఇచ్చారు. తొలి వికెట్‌కు 37 పరుగులు జోడించారు. గత మ్యాచులో ఓపెనర్‌గా వచ్చిన రిషభ్ పంత్ ఈ మ్యాచులో వన్ డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగాడు. సాధించాల్సిన స్కోరు పెద్దగా లేకపోవడంతో ఆచీతూచీ బ్యాటింగ్ చేశాడు. భారీ షాట్లకు పోకుండా.. సమయోచితంగా జట్టును నడిపించాడు. అయితే చివర్లో ఆయుశ్ బదోనీ (12), నికోలస్ పూరన్ (1), అబ్దుల్ సమద్ (16) త్వరగా ఔట్ కావడంతో మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. చివరి ఓవర్‌లో లక్నో విజయానికి 9 పరుగులు అవసరం అయ్యాయి. తొలి రెండు బంతులను బౌండరీకి తరలించిన పంత్.. మ్యాచ్‌ను సన్ రైజర్స్‌కు దూరం చేశాడు. ఐదో బంతికి మరో సింగిల్ తీసి.. మ్యాచ్ ముగించాడు. 50 బంతుల్లో 68 రన్స్ చేసి అజేయంగా నిలిచాడు. ఒంటి చేత్తో జట్టును గెలిపించాడు. ఈ విజయంతో లక్నో.. ఐపీఎల్ 2025 పాయింట్స్ టేబుల్‌లో బోణీ కొట్టింది. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్ రైజర్స్ హైదరాబాద్.. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. ఓ దశలో సన్ రైజర్స్.. 26 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. ఈ సమయంలో హెన్రిచ్ క్లాసెన్ (41 బంతుల్లో 62 రన్స్), నితీశ్ కుమార్ రెడ్డి (33 బంతుల్లో 56 రన్స్) చేయడంతో కోలుకుని.. పోరాడే లక్ష్యాన్ని నిర్దేశించింది.

# దద్దరిల్లిన గల్ఫ్..

మొదటి తరువాయి

ఈ విషయాన్ని ఆ దేశ విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆదివారం వెల్లడించింది. ఈ దాడులతో ఆ ప్లాంట్లకు భారీగా నష్టం ఏర్పడిందని, దీంతో రెండు విద్యుత్తు ఉత్పత్తి యూనిట్లను మూసివేశామని, అయితే ఇందులో ఎవరూ మరణించడం కానీ, గాయపడటం కానీ జరగలేదని తెలిపారు. కువైట్‌లోని ప్రభుత్వ కాంప్లెక్స్‌పై కూడా ఆదివారం డ్రోన్ దాడి జరిగింది. ఈ కాంప్లెక్స్ చమురు మంత్రిత్వ శాఖ, కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం ఉన్నట్టు స్థానిక మీడియా తెలిపింది. దాడుల నేపథ్యంలో సిబ్బందిని ఇంటి వద్ద నుంచే విధులు నిర్వహించాలని ఆదేశించామని అధికారులు తెలిపారు. తమ దేశంలోకి దూసుకొస్తున్న క్షిపణులు, డ్రోన్లను చాలావరకు నిరోధించినట్టు కువైట్ మిలిటరీ ప్రకటించింది. అధికారులు జారీ చేసే భద్రతా మార్గదర్శకాలను పౌరులు తప్పనిసరిగా పాటించాలని కోరింది. డ్రోన్ దాడిలో తమ షువైక్ చమురు క్షేత్రం మంటల్లో చిక్కుకుందని కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ తెలిపింది. మంటలను అత్యవసర బృందాలు అదుపు చేస్తున్నాయని, జరిగిన నష్టాన్ని



అంచనా వేస్తున్నట్టు కువైట్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. శుక్రవారం మినియా అల్ అహ్మదీ చమురు శుద్ధి కర్మాగారంపై దాడి తర్వాత ఇరాన్ తన దాడులను కొనసాగిస్తూనే ఉందని పేర్కొన్నది.

**బహ్రెయిన్‌లో బాప్కో ఎనర్జీస్‌పై దాడి**

బహ్రెయిన్‌లోని అతిపెద్ద రిఫైనరీ అయిన బాప్కో ఎనర్జీస్ నిర్వహిస్తున్న సదుపాయంలోని ఒక స్టోరేజ్ ట్యాంక్‌పై ఆదివారం ఇరాన్ క్షిపణితో దాడి జరిపింది. దాడిలో ఆ ప్రదేశంలో భారీగా ఎగసిపడుతున్న మంటలు, నల్లటి పొగతో నిండిన వీడియోను ఇరాన్ ప్రభుత్వ మీడియా ప్రసారం చేసింది. 10 సెకన్ల ఈ క్లిప్‌లో తొలుత అక్కడ భారీ పేలుడు సంభవించి ఆ ప్రదేశం అగ్నిగోళంగా మారిపోయింది. ఆ తర్వాత భారీగా ఎగసిపడ్డ మంటలు, నల్లటి పొగ కన్పించాయి. కాగా, దాడి ప్రమాదాన్ని పసిగట్టి సైరన్‌లు మోగించి పౌరులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు బహ్రెయిన్ ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. గత నెలలో కూడా ఇరాన్ ఈ ప్రదేశంపై దాడి చేసినట్టు అధికారులు తెలిపారు. గత 24 గంటల్లో తమపై 13 డ్రోన్లతో దాడి జరిగినట్టు బహ్రెయిన్ వెల్లడించింది.

**అమెరికా ఎంబసీకి భారీగానే నష్టం**

రియాద్‌లోని యూఎస్ ఎంబసీపై ఇరాన్ గత నెలలో చేసిన డ్రోన్ దాడిలో గతంలో పేర్కొన్న దానికన్నా భారీగానే నష్టం జరిగిందని అమెరికా మాజీ అధికారులను ఉటంకిస్తూ వాల్ స్ట్రీట్ జర్నల్ (డబ్ల్యూస్‌జే) తెలిపింది. ఈ దాడి లో ఇరాన్ రాయబారి క్వార్టర్స్‌తో పాటు కార్యాలయం కూడా పూర్తిగా ధ్వంసం అయింది. మూడంతస్తుల భవనం తీవ్రంగా దెబ్బతింది. మరోవైపు, ఇరాక్‌లోని అమెరికా దౌత్య కార్యాలయాలపై ఇరాన్ మద్దతు గ్రూపులు దాడులు చేసినట్టు అమెరికా ఎంబసీ తెలిపింది.

# న్యాయస్థానం పవిత్ర ఆలయం

మొదటి తరువాయి

ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ హైకోర్టు సముదాయం దేశంలో నే అత్యుత్తమ హైకోర్టుగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కోర్టు గదులు, పరిపాలనా భవనాలు, ఆర్కైవ్స్, నివాస మౌలిక సదుపాయాలు, శిక్షణా కేంద్రాలన్నింటినీ సకల సౌకర్యాలతో ఒకే ప్రాంగణంలో నిర్మించేందుకు ప్రభుత్వం సంకల్పించటం అభినందనీయమన్నారు. న్యాయవ్యవస్థ తన సొంత నిబంధనల ప్రకారం, తన సొంత పరిధిలో పనిచేస్తుందని చెప్పారు. మనం సిద్ధాంతం నుంచి ఆచరణలోకి మారినప్పుడు సంస్థాగత స్వయం సమృద్ధి ఇలాగే ఉంటుందనీ, నేర్చుకోవడం మానేస్తే న్యాయవ్యవస్థ పరిణామం చెందడం కూడా ఆగిపోతుందని వివరించారు. హైకోర్టు ఆడిటోరియంలో జిల్లాల న్యాయ సదస్సులు, శిక్షణా కార్యక్రమాలు, పౌరుల కోసం న్యాయ అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. మూడు అంతస్తుల్లో నిర్మిస్తున్న సెంట్రల్ రికార్డ్ రూమ్ కూడా అంతే ముఖ్యమైనదనీ, భద్రపరిచిన, అందుబాటులో ఉన్న పూర్వ తీర్పులు, ఆ తర్వాత వచ్చే ప్రతి తీర్పునూ బలోపేతం చేస్తాయని చెప్పారు. దీనికి తగినంత ప్రాధాన్యత, ప్రాముఖ్యత ఇవ్వటం హర్షణీయమంటూ ప్రభుత్వ ప్రణాళికను ప్రసంసించారు. సుస్థిర మౌలిక సదుపాయాలను మొదటి నుంచే డిజైన్‌లో పొందుపరిచారన్నారు. ఈ భవనం తరతరాల న్యాయమూర్తులకు, వ్యాజ్యదారులకు సేవలందించే ప్రాంగణం కాబట్టి ఈ భూమిని గౌరవించాలని సూచించారు. కొత్త భవనం కోసం వందెకరాలు కేటాయించడమేగాకుండా, ఈ ప్రాజెక్టుకు రూ.2,500 కోట్లకు పైగా నిధులు మంజూరు చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి సీజేఐ ధన్యవాదాలు తెలిపారు. రాబోయే వందేండ్ల పాటు సేవలందించేలా రూపొందించిన ఈ కొత్త హైకోర్టు ప్రాంగణం రెండేండ్లలో పూర్తవుతుందని చెప్పారు. 2024లో శంకుస్థాపన చేసిన జోన్-1 పురోగతిపై సంతృప్తిని వ్యక్తం చేస్తూ, జోన్-2 కూడా మరో కీలకమైన మైలురాయిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు పీఎస్ నరసింహ, ఉజ్జల్ భూయాన్, ఎస్వీ భట్టి, అలోక్ అరధే, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్‌కుమార్ సింగ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, రోడ్లు, భవనాల శాఖ సెక్రెటరీ వికాస్‌రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌జీ కర్ణన్, జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఈ భవన నిర్మాణ డ్రాయింగ్‌లు, కోర్టు నమూనాలను సీజేఐ, సీఎం తదితరులు పరిశీలించారు.

**ప్రార్థనా మందిరాలకంటే పవిత్రం : సీఎం రేవంత్‌రెడ్డి**

కోర్టును నిర్మిస్తే ఒక పవిత్ర స్థలాన్ని నిర్మించినట్టే. గుడి, మసీదు, చర్చి కంటే ఎక్కువగా అన్ని మతాల వారందరికీ ఇది ఒక పవిత్రమైన ప్రదేశం. తన ప్రజా జీవితంలో ఈ శంకుస్థాపన సందర్భాన్ని ఒక అరుదైన, చారిత్రాత్మక ఘట్టంగా నిలుస్తుంది. ఏ నాయకుడి జీవితంలోనైనా కోర్టు సముదాయాన్ని నిర్మించటమనేది అరుదుగా జరుగుతుంది. శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలు స్వయంప్రతిపత్తితో, పరస్పర ఆధారితాలుగా గౌరవంతో పనిచేస్తాయి. సామాన్య పౌరుడు న్యాయం కోసం తట్టే చివరి ద్వారం, ఆఖరి ఆశ్రయం న్యాయస్థానమే. నూతన హైకోర్టు సముదాయం న్యాయానికి ప్రతీకగా, ప్రజాస్వామ్యానికి క్రియాశీల జీవనాడిగా నిలవాలి. రాబోయే వందేండ్లపాటు పేదలు, బలహీనులు, గొంతులేనివారు, అణగారిన వారు తమ వాణిని వినిపించుకోవడానికి వీలుగా ఈ న్యాయ దేవాలయం తన సేవలందించాలి. ప్రజాస్వామ్య విలువలకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. న్యాయవ్యవస్థకు ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించటమనేది కార్యనిర్వాహకవర్గం ముఖ్యమైన బాధ్యత. కోర్టులోని అన్ని విభాగాలు పరస్పర గౌరవంతో కలిసికట్టుగా పనిచేయాలి. ఘర్షణలకు దూరంగా ఉండాలి. తీర్పులు, తీర్మానాలకే కాకుండా, న్యాయవ్యవస్థ పరిశీలనలు, అభిప్రాయాలను కూడా గౌరవిస్తాం. హైదరాబాద్‌లోని ప్రస్తుత హైకోర్టు భవనానికి చారిత్రకంగా ఎంతో ప్రాధాన్యత, ప్రాముఖ్యత ఉన్నప్పటికీ అది వ్యాజ్యదారులు, న్యాయవాదులు, సిబ్బంది అవసరాలను ముమ్ముందు తీర్చలేవు. అందువల్లే అత్యాధునిక ప్రాంగణాన్ని నిర్మించేందుకు సంకల్పించాం.

## విద్వేషం జొప్పిస్తున్న బీజేపీ

**అసోం సభలో రాహుల్ గాంధీ విమర్శ**



గౌహతీ : ప్రజల మధ్యన విభజన తీసుకొచ్చి రాజకీయ లబ్ది పొందేందుకు బీజేపీ విద్వేషం వ్యాప్తి చేస్తోందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాహుల్ గాంధీ విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యం లో అసోంలోని బిశ్వనాథ్ చరియాలీలో ఆదివారం నిర్వహించిన ప్రచార సభలో రాహుల్ ప్రసంగించారు. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మను విద్వేషం విరజిమ్మే నేతగా ఆయన పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే.. హిమంత క్షమాపణలు కోరినా.. వదిలిపెట్టబోమని, చట్టపరంగా కచ్చితంగా చర్యలు తీసుకుంటామని రాహుల్ అన్నారు. హిమంతను దేశంలోనే అత్యంత అవినీతిపరుడైన ముఖ్యమంత్రిగా రాహుల్ పేర్కొన్నారు. అసోంకు చెందిన సుప్రసిద్ధ గాయకుడు, కీర్తిశేషులు జుబిన్ గర్గ్.. రాష్ట్ర ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు తన జీవితాంతం కృషి చేశారన్నారు. ఆయన ఎవరితోనూ దురుసుగా ప్రవర్తించలేదన్నారు. తమ కాంగ్రెస్ పార్టీ భావజాలం కూడా అలాంటిదేనని, ద్వేషానికి వ్యతిరేకంగా ప్రేమను పంచడమే తమ సిద్ధాంతమని తెలిపారు. అస్సాంలో తాము అధికారంలోకి వస్తే.. జుబిన్ మృతి కేసులో దోషులను 100 రోజుల్లోగా శిక్షిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని ఆరు సామాజిక తరగతులకు షెడ్యూలు తెగ (ఎస్టీ) హోదా ఇస్తామని, తేయాకు కార్మికులకు రోజుకు రూ.450 చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## అబద్ధాల పునాదుల మీద గెలిచిన రేవంత్‌రెడ్డి

మొదటి తరువాయి

ఇప్పుడు ఎందుకు కక్కించడం లేదని ప్రశ్నించారు. సీఎం భక్వాస్ మాటలు మాట్లాడుతున్నారనీ, భూములు అన్యాక్రంతమవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. తనను కేసీఆర్ బీఆర్ఎస్ నుంచి బయటికి పంపించి ఐదేండ్లు అవుతుందనీ, ఇప్పుడు తాము పార్టీ మారుతున్నానని కొంతమంది పోస్టర్లు వేస్తున్నారని ఖండించారు. పార్టీలు మారడం బట్టలు మార్చినంత ఈజీ కాదనీ, తానే పార్టీలు మారకూడదనే సందేశం ఇచ్చినట్టు తెలిపారు. 25 ఏండ్లు బీఆర్ఎస్‌లో ఉన్నందుకు అత్యధికంగా పరిచయం ఉన్నవారు, అభిమానించేవారు ఆ పార్టీలో ఇంకా ఉన్నారని చెప్పారు. తనను పోగొట్టుకుని కేసీఆర్ తప్పు చేశారని ప్రజలు అంటున్నారనీ, పెద్ద ఎత్తున చర్చ జరుగుతుందన్నారు. మళ్ళీ వీరందరూ కేసీఆర్‌తో కలుస్తారనే చర్చ జరుగుతోందనీ, ఇందులో నిజం లేదన్నారు. తనను బీఆర్ఎస్‌లో బర్తరఫ్ చేయడమే కాకుండా ఇబ్బందులు పెట్టారని గుర్తు చేశారు. కోళ్ళ ఫార్మ్‌లు కూల్చారనీ, భూములు గుంజుకున్నారనీ, తాను లీగల్‌లుగా కొనుక్కున్నవి సైతం చెరబట్టారనీ, ఈ విషయమై సీఎంకు లేఖ రాస్తానని తెలిపారు. బీజేపీ ఎంపీలు ఆరు మంది ఉన్నారనీ, తమ ఎమ్మెల్యేలతో కలిసి కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో జరిగే ఎన్నికలపై సర్వేలు చేస్తున్నామనీ, తప్పకుండా గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను ఓడించేందుకు కాంగ్రెస్‌లోకి వెళ్లి ఉంటే మంత్రినో, డిప్యూటీ సీఎంనో అయి ఉండేవాడిని అని తెలిపారు. తాను పదవుల కోసం పాకులాడననీ, తన పట్ల చిల్లర మాటలు మాట్లాడుతున్నారన్నారు.

# బాబు జగ్జీవన్ రామ్‌కు భారత రత్న ఇవ్వాలి

**-- ఉప్పుల నర్సింహా**



**ఆమనగల్లు, ఏప్రిల్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పుల నర్సింహా మాట్లాడుతూ, దేశానికి చేసిన విశిష్ట సేవలకు గాను డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్‌కు భారత రత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆమనగల్లు మండలం విట్టాయిపల్లి అరుంధతి కాలనీలో ఆయన జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాల్యంలో కుల వివక్షను ఎదుర్కొన్నప్పటికీ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించిన జగ్జీవన్ రామ్ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపారు. నెహ్రూ, ఇందిరా ప్రభుత్వాల్లో రక్షణ, వ్యవసాయ, కార్మిక శాఖల మంత్రిగా అవినీతి మరకలేకుండా సేవలందించారు. భారత్--పాక్ యుద్ధ సమయంలో రక్షణ మంత్రిగా దేశానికి విజయాన్ని అందించిన ఘనత ఆయనకే దక్కింది. వ్యవసాయ మంత్రిగా 'ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా' (ఎఫ్సీఐ)ని స్థాపించి దేశానికి ఆహార భద్రత కల్పించారు. అణగారిన వర్గాల సంక్షేమం ఆయన జీవిత ధ్యేయమని, అంబేద్కర్ గారి సమకాలికుడిగా సమాజ ఉన్నతి కోసం నిరంతరం కృషి చేశారని ఉప్పుల నర్సింహా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కె. సాలయ్య, జిల్లా ప్రతినిధి వద్ది నిరంజన్, కె. దశరథం, వై. రామచంద్రయ్య, జి. రామస్వామి, కె. వీరయ్య, రాములు, వై. జంగయ్య, కె. నరేష్, ఎస్. మల్లయ్య, వై. మహేష్, డి. జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ఇబ్బందులు నివారించేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

**-చెరుకు శ్రీరామ్ గౌడ్**



**మర్రిగూడ, ఏప్రిల్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలో వరి పంట కోతకు వస్తున్నందున రైతుల సౌకర్యార్థం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని బీసీ సంఘం మండల అధ్యక్షుడు చెరుకు శ్రీరామ్ గౌడ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. గత వానాకాలం సీజన్‌లో ప్రభుత్వం అరకొరగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వేసవిలో రైతులు తమ వరి పంటను ఆరబెట్టడానికి అనుకూలమైన స్థలంలోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బట్టు చంద్రశేఖర్, నల్ల శేఖర్, ఆమంచ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలి

**-- పూలే డేవిడ్, కొండేటి శ్రీను**



**నిడమానూరు, ఏప్రిల్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా నిడమానూరులో దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి ఘనంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పూలే డేవిడ్, కొండేటి శ్రీను మాట్లాడుతూ, జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఏప్రిల్ నెలను మహనీయుల మాసంగా ప్రకటించి వారి ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బొజ్జ పుల్లయ్య, ఆదిమల్ల భాస్కర్, గణపాక లక్ష్మణ్, పెరమళ్ళ మట్టయ్య, బొజ్జ శేఖర్, ముదిగొండ కిరణ్, నాగయ్యతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బీజేపీ మండల అధ్యక్షుల నియామకం

**తిమ్మాపూర్, ఏప్రిల్ 05 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం, హుజూరాబాద్ రూరల్, జమ్మికుంట రూరల్ బిజెపి మండల శాఖలకు నూతన అధ్యక్షుల నియామకం జరిగింది. ఆదివారం జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి నియామక ఉత్తర్వులు విడుదల చేశారు. తిమ్మాపూర్ మండల అధ్యక్షుడిగా చింతం శ్రీనివాస్, హుజూరాబాద్ రూరల్ అధ్యక్షుడిగా పారిపల్లి కొండల్ రెడ్డి, జమ్మికుంట రూరల్ అధ్యక్షుడిగా దొంతన వేణి రమేష్ బాధ్యతలు స్వీకరించారు.

# సిద్ధాంతాలతో బీజేపీ బలోపేతం

**కార్యకర్తలే అసలైన బలం: నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి**



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మంచాల్, ఇబ్రహీంపట్నం రూరల్ మండలాల్లో నిర్వహించిన పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ్ మహాభియన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, బీజేపీ సిద్ధాంతపరమైన పార్టీగా కార్యకర్తల శక్తిపై నిర్మితమైందని అన్నారు. సాధారణ కార్యకర్తలను కూడా ఉన్నత స్థాయి నాయకులుగా తీర్చిదిద్దే ప్రత్యేకమైన సంస్థాగత వ్యవస్థ బీజేపీకి మాత్రమే ఉందని, "దేశం ముందుగా -- పార్టీ తర్వాత -- వ్యక్తి చివరగా" అనే సిద్ధాంతంతో పార్టీ ముందుకు సాగుతోందని వివరించారు. సమగ్ర మానవవాదం, సాంస్కృతిక జాతీయవాదం, అంత్యోదయ భావనల ఆధారంగా సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకుంటూ అభివృద్ధి సాధించడమే బీజేపీ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. సేవా భావం, క్రమశిక్షణ, నిబద్ధతతో పని చేసే కార్యకర్తలే పార్టీకి అసలైన బలం అని అన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, శేకర్ రెడ్డి అధ్యక్షతన పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేసీఆర్ మౌనాన్ని అలుసుగా తీసుకోవద్దు

**- సీనియర్ నాయకులు సయ్యద్ ఖలీల్**



**ఆమనగల్లు, ఏప్రిల్ 05 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** గజ్వేల్ లోని కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై దాడిని మాజీ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ ఖలీల్ తీవ్రంగా ఖండించారు. ఆదివారం పట్టణ కేంద్రంలో ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. ఈ దాడి నాలుగున్నర కోట్ల ప్రజల ఆత్మగౌరవంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. కాంగ్రెస్ అరాచకాలను కేసీఆర్ భరించడం ఆయన గొప్పతనమని, ఆయన మౌనాన్ని బలహీనతగా భావించవద్దని హెచ్చరించారు. ప్రణబ్ ముఖర్జీ, అరుణ్ జైట్లీ వంటి గొప్ప నేతలే కేసీఆర్ ను మెచ్చుకున్నారని ఆయన గుర్తుచేశారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి ఘటనలు చోటు చేసుకోవడం అత్యంత దురదృష్టకరమని ఖలీల్ అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజల దృష్టిని అసలు సమస్యల నుండి మళ్లించేందుకు ఇలాంటి దాడులను ప్రోత్సహిస్తున్నట్లుగా కనిపిస్తోందని ఆయన విమర్శించారు. ఈ ఘటనపై పోలీసులు వెంటనే స్పందించి, దాడికి పాల్పడిన దుండగులను గుర్తించి కేసులు నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

# గొప్ప సంఘ సంస్కర్త డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్


**- సర్పంచ్ వీరమళ్ళ శిరీష లోకేష్ గౌడ్**



**మర్రిగూడ, ఏప్రిల్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉప ప్రధాన మంత్రి, సంఘ సంస్కర్త డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా చిత్రపటానికి సర్పంచ్ వీరమళ్ళ శిరీష లోకేష్ గౌడ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంపీగా, కేంద్ర మంత్రిగా, దేశ ఉప ప్రధానిగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, సమాజంలో అణగారిన వర్గాల సంక్షేమం కోసం అలుపెరుగని కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్తగా బాబు జగ్జీవన్ రామ్ ఎప్పటికీ గుర్తుండిపోతారని అన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నల్ల చంద్రశేఖర్ గౌడ్, మహేశ్వరం సతీష్, పందుల రాములు గౌడ్, చెరుకు శ్రీరాములు గౌడ్, బట్టు చంద్రశేఖర్, ఈద రాములు, అమంచ రమేష్, యండి అశ్వక్, నల్ల మధు, వీరమళ్ళ గణేష్, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే బక్కని**





**షాద్‌నగర్, ఏప్రిల్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారత మాజీ ఉప ప్రధాని, సంఘ సంస్కర్త డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు షాద్‌నగర్‌లో ఆదివారం ఘనంగా జరిగాయి. విగ్రహానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా హక్కులు కల్పిస్తే, వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేసిన నాయకుడు జగ్జీవన్ రామ్ అని అన్నారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆయన రక్షణ మంత్రిగా దేశానికి విజయాన్ని అందించారని, వ్యవసాయ మంత్రిగా ఆహార భద్రత కల్పించారని గుర్తుచేశారు. కార్యక్రమ నిర్వాహకుడు జాంగారి రవి మాట్లాడుతూ, యువత ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకలకు ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నేతలు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# గ్రామపంచాయతీ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



**వెల్దండ, ఏప్రిల్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చేర్యాకర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆదివారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామ సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల అభ్యున్నతికి బాబుజీ చేసిన కృషి స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాలను ఆచరిస్తూ ముందుకు సాగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి హరణి, ఉప సర్పంచ్ కొండలు, వార్డు సభ్యులు పురుగుల లాలయ్య, పురుగుల రమేష్, బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎండి అలీలుద్దీన్, మీసాల రాజు, వెంకటయ్య, జంగయ్య, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా ఘన నివాళులు



**దేవరకొండ, ఏప్రిల్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దేవరకొండ పట్టణంలో మహానేత, స్వాతంత్ర్య సమరయోధుడు బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘనంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసేన పార్టీ సీనియర్ నాయకులు కొర్ర చందు నాయక్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కంబాలపల్లి వెంకటయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొర్ర చందు నాయక్ మాట్లాడుతూ, 1908లో జన్మించిన జగ్జీవన్ రామ్ సాధారణ కుటుంబం నుండి ఎదిగి దేశ రాజకీయాల్లో అగ్రస్థానాన్ని అందుకున్నారని, స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. కార్యక్రమంలో అరేకంటి యేసయ్య, కొండ్రపల్లి రమేష్, పొట్ట ప్రభు, మద్దిమడుగు నవీన్, అంకూరి హరీష్, అంకూరి శివ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి ఉత్సవాలు



**చింతల్ బస్తీ, ఏప్రిల్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా స్థాయి ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి ఉత్సవాలు ఆదివారం మల్కాజిగిరి చింతల్ బస్తీలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ ఫైజల్ అహ్మద్, మల్కాజిగిరి జోనల్ కమిషనర్‌తో పాటు వివిధ సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గాల సోషల్ వర్కర్లకు 'దళితరత్న' అవార్డులు అందజేశారు. వికలాంగుల పక్షాన సేవలు అందిస్తున్న గుత్తికొండ కిరణ్‌కు అవార్డును ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అందజేశారు. గుత్తికొండ కిరణ్ మాట్లాడుతూ, ఈ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందని, మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేసి బడుగు బలహీన వర్గాలకు సహాయం అందిస్తానని తెలిపారు. తనను ఎంపిక చేసిన మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, రావుల అంజన్న, సతీష్, ఉపేందర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా ఘన నివాళులు



**మిర్యాలగూడ, ఏప్రిల్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మిర్యాలగూడ పట్టణంలో మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, కమిషనర్ శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బాబుజీ కుల వివక్షను ఎదుర్కొన్నప్పటికీ ఉన్నత విద్యను అభ్యసించి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని దేశ రాజకీయాల్లో అగ్రస్థానాన్ని అందుకున్నారని అన్నారు. రక్షణ మంత్రిగా 1971 భారత్--పాక్ యుద్ధంలో విజయాన్ని అందించడంలో, వ్యవసాయ మంత్రిగా హరిత విప్లవం ద్వారా ఆహార స్వయం సమృద్ధి సాధించడంలో ఆయన పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

## 32 ఏళ్లుగా దాహార్తి తీర్చుతున్న
# సత్యసాయి చలివేంద్రం



**ఆమనగల్లు, ఏప్రిల్ 05 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గత 32 సంవత్సరాలుగా నిరంతరాయంగా సాగుతున్న సేవా కార్యక్రమమైన సత్యసాయి చలివేంద్రంను ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఘనంగా ప్రారంభించారు. వేసవి కాలంలో ప్రయాణికుల దాహార్తి తీర్చే ఈ సేవా కార్యక్రమాన్ని ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమాల్లో సత్యసాయి సంస్థలు ఎప్పుడూ ముందుంటాయని, వారి సేవలు స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగపడటం హర్షణీయమని అన్నారు. పట్టణ కేంద్రానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు, భక్తులకు వేసవి కాలంలో ఈ చలివేంద్రం ఎంతో ఉపయుక్తమవుతుందని తెలిపారు. ప్రయాణికుల దాహార్తిని తీర్చే ఈ సేవ నిజంగా ఆదర్శప్రాయమని కొనియాడారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ దొంతు శ్రీను మాట్లాడుతూ.. ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు చలివేంద్రంలో కుండలలో నిల్వ చేసిన చల్లని మినరల్ శుద్ధి నీటిని ప్రయాణికులకు అందజేస్తామని తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో సాయి భక్తులు అంకితభావంతో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో కన్వీనర్ దొంతు శ్రీను, డాక్టర్ దొంతు పుల్లయ్య, ఉప్పు శ్రీశైలం, ఆలేటి నారాయణ సాగర్, కృష్ణారెడ్డి, గోల్డ్ రాము, ఎన్ఆర్ ప్రభాకర్, పోలిశెట్టి శ్రీనివాస్, ఆమనగంటి సంజీవ్ కుమార్, అప్పం తిరుపతయ్య, దాస శ్రీనివాసులు, విజయ్ కుమార్, ఆమనగంటి నాగభూషణం అయ్యగారు, మొహమ్మద్ సమీహుద్దీన్, శంకర్, అల్లాజీ, ఎన్ శ్రీధర్, గోల్డ్ బ్రహ్మం, నాగిళ్ల లింగం తదితరులు ఉన్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు
# సేవలు ప్రశంసనీయం

- జిల్లా గవర్నర్ మహేంద్ర కుమార్ రెడ్డి
- లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ జిల్లా 320ఏ బెస్ట్ క్లబ్, బెస్ట్ బ్యానర్ గా నిలిచిన లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు




**ఆమనగల్లు, ఏప్రిల్ 05 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు సేవలు ప్రశంసనీయమని జిల్లా గవర్నర్ లయన్ మహేంద్ర కుమార్ రెడ్డి కొనియాడారు. లయన్స్ ఇంటర్నేషనల్ 320ఏ 10వ వార్షిక జిల్లా కాన్ఫరెన్స్ అదివారం శంషాబాద్ లోని అతిథి కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించారు. జిల్లా కన్వెన్షన్ లో వివిధ రాష్ట్రాల నుండి 93 క్లబ్ లు పాల్గొన్నాయి. 93 క్లబ్బుల్లో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు బెస్ట్ క్లబ్ మరియు బెస్ట్ బ్యానర్ గా నిలిచిందని జిల్లా గవర్నర్ మహేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లుకు అంతర్జాతీయ స్థాయిలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని, ఈ కాన్ఫరెన్స్ లో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ లో లయన్స్ క్లబ్ అఫ్ అమనగల్లు ఫోటో ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో పీడీజి లయన్ చెన్న కిషన్ రెడ్డి, పీడీజీ లయన్ సందడి నరేందర్ రెడ్డి, పీడీజీ లయన్ జూలూరి రమేష్ బాబు, రీజియన్ చైర్మన్ లయన్ జనార్ధన్ రెడ్డి, జోన్ చైర్మెన్ లయన్ జూలూరి లింగయ్య, ప్రెసిడెంట్ లయన్ గోవర్ధన్ రెడ్డి, కార్యదర్శి లయన్ గంప శ్రీను, కోశాధికారి లయన్ శ్రీనివాస్ రెడ్డి , కో ఆర్డినేటర్ లయన్ భిక్షపతి, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ లు కండె ఓంకారం, జూలూరి రమేష్ , లయన్ ఓంకారం, సునంద అంజయ్య, బండెల రామచంద్ర రెడ్డి, రాంరెడ్డి, అర్ధం మనోహర్, సుధా చెన్న కిషన్ రెడ్డి, గీత నరేందర్ రెడ్డి, చంద్రశేఖర్, విష్ణువాస్ రెడ్డి, అంజి రెడ్డి లయన్స్ క్లబ్ సభ్యులు వెంకటేశ్, రాజేందర్, నర్సింహా, చేగూరి వెంకటేష్, జహంగీర్, బిచ్య నాయక్, పిఆర్ఓ పాషా తదితరులు పాల్గొన్నారు.

# పిఆర్ఓ పాషా కు అంతర్జాతీయ అవార్డు



**ఆమనగల్లు, ఏప్రిల్ 05 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా 320ఏ పదవ వార్షిక కన్వెన్షన్ సమావేశం ఆదివారం శంషాబాద్ లోని అతిథి కన్వెన్షన్ హాల్లో జిల్లా గవర్నర్ లయన్ గడ్డం మహేంద్ర కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథులుగా ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ మగేష్, లయన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్ పర్సన్ లయన్ జి బాబురావు, గెట్ ఏరియా లీడర్ ఆర్ సునీల్ కుమార్, ఫస్ట్ వైస్ గవర్నర్ సురేష్ జిజ్ఞాని, సెకండ్ వైస్ గవర్నర్ డాక్టర్ కే శశికాంత్, కన్వెన్షన్ చైర్ పర్సన్ జూలూరి రఘు హాజరయ్యారు. ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ మగేష్ గారి చేతుల మీదుగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు పిఆర్ఓ ఎంఏ పాషా కు అంతర్జాతీయ అవార్డు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. గత 18 ఏళ్లుగా లయన్స్ క్లబ్ సేవలను ప్రజలలో తీసుకెళ్లి విస్తృత ప్రచారం చేస్తున్నందుకు పాషాకు ఈ అవార్డు దక్కింది. జిల్లా స్థాయిలోనే అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించిందని పిఆర్ఓ పాషా తెలిపారు. ఈ అవార్డుకు సహకరించిన లయన్స్ క్లబ్ గవర్నర్ లయన్ జి మహేందర్ కుమార్ రెడ్డి, మాజీ గవర్నర్ జి చెన్న కిషన్ రెడ్డి, మాజీ మల్టిపుల్ చైర్మన్ సందడి నరేందర్ రెడ్డి, మాజీ గవర్నర్ పిడిజి జూలూరు రమేష్ బాబు, లయన్స్ క్లబ్ రీజియన్ చైర్ పర్సన్ సంపత్ జనార్ధన్ రెడ్డి, రామ్ రెడ్డి లయన్స్ ఐ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ వి దామోదర్ రెడ్డి, జోన్ చైర్మన్ జూలూరు లింగయ్య, లయన్స్ క్లబ్ అడ్మినిస్ట్రేటివ్ బిక్షపతి, క్లబ్ అధ్యక్షులు కే గోవర్ధన్ రెడ్డి, క్లబ్ జిల్లా చైర్మన్ లు క్లబ్ సభ్యులు పాషకు అభినందనలు తెలిపారు.

## నందివనపర్తి గ్రామంలో ఘనంగా డా. బాబు జగ్జీవన్ రామ్ 119 వ జయంతి వేడుకలు



**యాచారం , ఏప్రిల్05 (నీలగిరి ఎక్స్ ప్రెస్) :** మాజీ ఉప ప్రధాని, దళిత బహుజన నేత డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు నందివనపర్తి గ్రామంలో సర్పంచ్ రాయికంటి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో డా. బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సంద్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..బాబు జగ్జీవన్ రామ్ అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం చేసిన సేవలు, త్యాగాలను స్మరించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, సంఘసంస్కర్తగా, సుదీర్ఘకాలం కేంద్ర మంత్రిగా దేశానికి విశేష సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని వివిధ వార్డు సభ్యులు చెట్టిమల్ల భాగ్యమ్మ గారు, మూలి రమేష్ పాల్గొన్నారు. మరియు బీజేపీ గ్రామ సీనియర్ నాయకులు సామ సంతోష్, కొండాపురం రాజ్ కుమార్ తదితరులు హాజరై డా. బాబు జగ్జీవన్ రామ్ సేవలను స్మరించుకున్నారు. వారి సామాజిక సేవలు, దేశాభివృద్ధికి చేసిన కృషి గురించి ప్రసంగిస్తూ, ఆయన ఆశయాలను అనుసరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రేమ, శాంతి, త్యాగానికి ప్రతీక ఈస్టర్






**- ఘనంగా ఏసుక్రీస్తు పునరుద్దాన వేడుకలు**

**ఆమనగల్లు, ఏప్రిల్ 05 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఈస్టర్ పండుగ ప్రేమ, శాంతి, త్యాగానికి ప్రతీక అని పాస్టర్ బాలరాజు పేర్కొన్నారు. ఏసుక్రీస్తు సర్వలోక పాప పరిహార అర్ధమై ఈ లోకంలో మానవ రూపం దాల్చి మరణించి మూడో రోజు తిరిగి మహిమ శరీరంతో లేచిన నిజ దేవుడు ఏసుక్రీస్తు అని తెలిపారు. ఆదివారం ఆమనగల్లు పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో ఏసుక్రీస్తు పునరుద్దానం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఏంబి చర్చిలో ఏసుక్రీస్తు పునరుద్దాన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ బాలరాజు మాట్లాడుతూ.. యేసు క్రీస్తు ఈ లోకంలో సర్వ మానవాళి చేసిన పాపాల నుండి విముక్తిని పొందేందుకు సిలువలో మరణించి తిరిగి మూడవ రోజు లేచాడని, ఆయన నేర్పిన శాంతి, సమాధానమే నేడు ప్రజలు అనుసరిస్తున్నారని చెప్పారు. బైబిల్ ఈ లోకంలో మానవుడు ఎలా జీవించాలో సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలో నేర్పించింది తప్ప, చెడు మార్గాన్ని ఎప్పుడు నేర్పించలేదని చెప్పారు. క్రైస్తవులు ఈ సమాజం పట్ల బాధ్యత కలిగి జీవిస్తారని ఎవరికీ కీడు చేసే ఉద్దేశం ఉండదని వివరించారు. క్రీస్తును పోలిన వారై సమాజం పట్ల ప్రేమ, శాంతి, సమాధానాన్ని మాత్రమే క్రైస్తవ సమాజం ఈ లోకానికి నేర్పిస్తుందని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో సంఘ సభ్యులు, భక్తులు, పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు లక్ష్మణ్, ఏలియా, సామెల్, పురుషోత్తం, తానయ్య, యాదయ్య భాస్కర్, లావణ్య, సంతోష, సరోజ, తబితమ్మ, సృజనమ్మ, విజయ, సునీత, సంఘ సభ్యులు, భక్తులు, విశ్వాసులు పాల్గొన్నారు.

# శాంతి కపోతం

ఓ శాంతి కపోతమా....
నీ జాడెక్కడ?
రక్తపు రుచి మరిగిన
రాబందుల చూసి
నెత్తురు చిందే
నేలను గాంచి
ఎక్కడికెగిరిపోయావు?
శారీరక,మానసిక వేదనతో
తల్లడిల్లే
పసి పిల్లల రోదనగాంచి
ఎక్కడికి పయనమయ్యావు?
పర్యావరణం కన్నా
రణమే ముఖ్యమని
పవిత్ర ప్రకృతి యోగం కన్నా
మారణ హోమమే మేలని భావించే
వింత పశువుల జూసి
మా చింత నుండి
దూరమయ్యావా?
క్షిపణుల దూకుడుతో
డ్రోన్ ల తాకిడితో
కుప్పకూలుతున్న
భవనాలను చూసి
ఈ భువనం నుండి
పారిపోయావా?
శాంతిని కోరే నరులెవ్వరు?
కాంతినిచ్చే మనసెక్కడ?
మానవత్వపు మనుజులెవ్వరు?
దాతృత్వపు దరి ఎక్కడ?
అని వెతుకుతున్నావా...?
రావమ్మా...
ఓ పావురమా... రా
స్వాగతిస్తుంది నా దేశం
విశ్వశాంతిని కాంక్షించే
భారతదేశం
నీకు ఆశ్రయమిస్తుంది
నిన్ను
సగర్వంగా...
స్వేచ్ఛగా...
ఎగరేస్తుంది.

సి.హెచ్. శ్రీనివాస్
ఉపాధ్యాయుడు
జడ్.పి.హెచ్.ఎస్ కనుకుల
స్వగ్రామం.. ఎలిగేడు



# మంచాలలో ఘనంగా హిందూ సమ్మేళనం






**మంచాల, ఏప్రిల్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో శనివారం మంచాలలో హిందూ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీమాన్ యోగేష్ ప్రబోజి, శ్రీ వెంకట నివాసి (తెలంగాణ గో సేవ ప్రముక్), హిందూ ధర్మ రక్షకురాలు భార్గవి కళ్యాణి, జర్నలిస్ట్--సామాజిక కార్యకర్త అమూర్త దేశపతి పాల్గొన్నారు.నోముల లింగంపల్లి, జైనమ్మగూడ గ్రామాల హిందువులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నల్గొండలో ఘనంగా జగ్జీవన్ రామ్ జయంతి




**నల్లగొండ, ఏప్రిల్ 05 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** స్వాతంత్ర సమరయోధుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్ రామ్ జయంతిని ఈరోజు నల్గొండ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఎన్జీ కళాశాల ఎదురుగా, మర్రిగూడ బైపాస్ వద్ద ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహాలకు కలెక్టర్ చంద్రశేఖర్, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్, గుమ్ముల మోహన్ రెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి



**నల్లగొండ, ఏప్రిల్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం బిక్షపతి ఆదివారం ఎస్సీ స్పాట్ సెంటర్‌లో మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన బాబుజీ సేవలను కొనియాడుతూ, అణగారిన వర్గాల సాధికారతకు ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు.కార్యక్రమంలో డిసిసిబి సెక్రటరీ శ్రీనివాస్, పీఆర్టీయూ- టీఎస్ జిల్లా అధ్యక్షులు కాళం నారాయణ రెడ్డి, జి.సి.డి.ఓ అరుంధతి, యూసఫ్ షరీఫ్, ఉపాధ్యాయులు అరుణ శ్రీ, అంజయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

# పోచమ్మకు మొక్కులు చెల్లించుకున్న మాజీ జెడ్పీ వైస్ చైర్‌పర్సన్



**ఎలిగేడు, ఏప్రిల్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని లోకపేట గ్రామ ప్రసిద్ధ పోచమ్మ తల్లిని ఆదివారం మాజీ జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక--రాయనర్సయ్యలు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, పాడి పంటలు సమయానికి పండాలని పోచమ్మ తల్లిని ప్రార్థించామని తెలిపారు.కార్యక్రమంలో ఎలిగేడు మాజీ సర్పంచ్ మంచిగా రాజనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.


# ఘనంగా బీజేపీ ఆవిర్బావ దినోత్సవం వేడుకలు

**ఎలిగేడు, ఏప్రిల్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని గ్రామాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కార్యకర్తలు తమ ఇళ్లపై బీజేపీ జెండాలను ఎగురవేసి పార్టీ బలోపేతానికి సంకల్పబద్ధంగా కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నర్సాపూర్ లో తన ఇంటిపై బిజెపి జెండా ఎగరవేసిన సీనియర్ బిజెపి నాయకుడు కొత్తిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి.

# వైభవంగా పోచమ్మ బోనాలు



**ఎలిగేడు, ఏప్రిల్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నర్సాపూర్ గ్రామంలోని శ్రీరేణుక ఎల్లమ్మతల్లి ఆలయంలో ఆదివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని దాదాపు 30 కుటుంబాల మహిళలు బోనాలను తలపై ఎత్తుకుని డప్పు, చప్పుళ్ల నడుమ ఆలయానికి తరలి వెళ్లి ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ ఉత్సవాలు నెల 8 వరకు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లెర్ల వెంకటేశ్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షులు పల్లెర్ల వెంకటయ్య గౌడ్, ఉపాధ్యక్షులు బుర్ర సదానంద గౌడ్, సభ్యులు పల్లెర్ల మొగిలి గౌడ్, కాట అంజయ్య గౌడ్, గ్రామ యువత, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

# తూర్పు తండాలో నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం



**మర్రిగూడ, ఏప్రిల్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల తూర్పు తండా ప్రజల త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. గత ఏళ్లుగా పనికిరాకుండా ఉన్న గ్రామ బోరుకు నూతన మోటార్‌ను ఆదివారం గ్రామ సర్పంచ్ వీరమళ్ళ శిరీషలోకేష్ గౌడ్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.త్రాగునీటి సరఫరా పునరుద్ధరించడంతో తండా ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. సర్పంచ్ బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని గ్రామస్తులు ప్రశంసించారు.కార్యక్రమంలో వార్డు సభ్యులు నల్ల చంద్రశేఖర్ గౌడ్, ముద్దం శ్రీరాములు గౌడ్, గ్రామస్థులు భీమ్ జి, పరమేష్, కుమార్, తరుణ్, సంతోష్, మోహన్, సక్కు, చందూ, బోయపల్లి శ్రీరాములు గౌడ్, వీరమళ్ళ గణేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తా

-- సర్పంచ్ రమాదేవి



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్

**ఎలిగేడు, ఏప్రిల్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రేకల్దేవుపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం సర్పంచ్ మద్దెల రమాదేవి--సంపత్ ప్రారంభించారు. ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సహకారంతో ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో పనులు చేపట్టారు.గ్రామ ప్రజలకు కావలసిన మౌలిక వసతుల కల్పనకు అహర్నిశలు కృషి చేస్తానని సర్పంచ్ పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణానికి నిధులు అందించిన విజయరమణారావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొడిగె శివకృష్ణ గౌడ్, వార్డు సభ్యులు ఎడ్ల సతీష్, మడ్లపల్లి జయ--శ్రీనివాస్, అనిత రవీందర్, గుడికందుల చంద్రకళ నరేశ్, నవీన్, ఆసంపల్లి స్వప్న శ్రీను, కారోబార్ తీట్ల శ్రీనివాస్, గోపు సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు





[redacted]

**ఎలిగేడు, ఏప్రిల్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండల కేంద్రంలో జీపీ కార్యాలయం, బస్టాండు ఆవరణలో ఆదివారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. చిత్రపటానికి పూలమాలలు వేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు.మండలంలోని పలు గ్రామాల్లో కూడా జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కప్పల ప్రవీణ్, ఉపసర్పంచ్ నరేశ్, మాజీ సర్పంచ్ బాసంపల్లి కొండయ్య, వార్డు సభ్యులు న్యాతరి పోచయ్య, బ్రహ్మోజు సంజీవ్ కుమార్, మడుపు నరేందర్, ఆసంపల్లి రవీందర్, అంజయ్య, సదానందం, బాసంపల్లి శ్రీనివాస్, శంకర్, గోపి శంకర్ రాజేశ్, సతీష్, ఎరోళ శంకర్, సాయినాద్, బీసీ సంఘాల నాయకులు అడ్డగుంట తిరుపతి గౌడ్, కోడూరు శ్రీనివాస్, కేంగర్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఈస్టర్ వేడుకలు



ఎలిగేడు చర్చిలో ప్రత్యేక ప్రార్థన నిర్వహిస్తున్న రెవరెండ్ పాస్టర్ సురేష్ బాబు

**ఎలిగేడు, ఏప్రిల్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండల కేంద్రంలోని బిలీవర్స్ ఈస్ట్రాన్ చర్చితో పాటు ధూళికట్ట, లాలపల్లి, సుల్తాన్పూర్, నర్సాపూర్ తదితర గ్రామాల్లో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.యేసు ప్రభువు పునరుత్థాన దినోత్సవాన్ని పురస్కరించుకుని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ రెవరెండ్ పాస్టర్ సురేష్ బాబు, ఆలపాటి పేతురు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలలో కలెక్టర్ కె. హైమావతి ఆకస్మిక తనిఖీ



**సిద్దిపేట, ఏప్రిల్ 05 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మిరుదొడ్డి మండలంలోని అల్వాల్ గ్రామంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి, ఆహార పదార్థాల నాణ్యతను స్వయంగా తనిఖీ చేశారు. కూరల నాణ్యతను మెరుగుపరచాలని సూచిస్తూ, కామన్ డైట్ మెనూను తప్పనిసరిగా పాటించాలని, వండిన ప్రతి వంటకం రుచికరంగా ఉండి విద్యార్థులు కడుపునిండా భోజనం చేసేలా చూడాలని వార్డెన్‌కు ఆదేశించారు. వంటగది పరిసరాల పరిశు భ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థులు భోజనం చేసిన వెంటనే పరిసరాలను శుభ్రం చేయాలని స్పష్టం చేశారు.రోజువారీగా విద్యార్థుల హాజరు ఆధారంగా వంట సరుకులు అందించాలని, భోజనం, వసతి, విద్య విషయాల్లో ఎలాంటి రాజీ పడకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రిన్సిపాల్‌కు ఆదేశించారు.

# బాలవికాస సమక్షంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకై చలివేంద్రం ప్రారంభం




**హుస్నాబాద్, ఏప్రిల్ 05 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామంలో బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. హుస్నాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు తల్లిదండ్రులు బంక ఉప్పవ్వ, రాజయ్యల జ్ఞాపకార్థంగా ఈ జలదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బంక లక్ష్మీ చందు సహకారంతో చలివేంద్రం ఏర్పాటు చేయబడింది.ఈ సందర్భంగా సర్పంచ్ బంక లక్ష్మీ మాట్లాడుతూ గ్రామస్తులు, బాటసారుల దాహార్తిని తీర్చే ఉద్దేశంతో చలివేంద్రం ఏర్పాటు చేయడం శ్రేయస్కరమైన కార్యక్రమమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్లు జ్యోతి, నిర్మల, శ్రీమతి, కవితతో పాటు సభ్యులు ఎల్లవ్వ, మేడలమ్మ, స్వరూప, రేఖ, శ్రీను, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మేయర్ క్యాంప్ కార్యాలయం ప్రారంభించిన మంత్రి బండి సంజయ్



**కరీంనగర్, ఏప్రిల్ 05 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నగరంలోని తీగలగుట్టపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన మేయర్ క్యాంప్ కార్యాలయాన్ని ఆదివారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మేయర్ కొలగని శ్రీనివాస్ కేంద్ర మంత్రికి గజమాలతో ఘన స్వాగతం పలికారు. ప్రజలకు మరింత చేరువయ్యేందుకు, సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేసేందుకు ఈ క్యాంప్ కార్యాలయం ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు, డిప్యూటీ మేయర్, నగర కార్పొరేటర్లు, అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. నూతన కార్యాలయం ఏర్పాటు పట్ల స్థానిక నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి రాకతో తీగలగుట్టపల్లి పరిసర ప్రాంతాల్లో కోలాహలం నెలకొంది.

# సామాజిక సమసమాజ నిర్మాత బాబూజీ ఆశయ సాధనే మన లక్ష్యం

-- పాండురంగా రెడ్డి



**కందుకూరు, ఏప్రిల్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల కేంద్రంలోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆదివారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.జాగృతి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్య ఉద్యమంలోనూ, స్వతంత్ర భారత నిర్మాణంలోనూ బాబుజీ పోషించిన పాత్ర చిరస్మరణీయమని అన్నారు. దళితుల అభ్యున్నతి, కుల వివక్ష నిర్మూలనలో ఆయన చేసిన కృషి వెలకట్టలేనిదని కొనియాడారు.రక్షణ మంత్రిగా 1971 యుద్ధంలో దేశానికి విజయాన్ని అందించడంలో, వ్యవసాయ మంత్రిగా హరిత విప్లవం ద్వారా ఆహార భద్రత సాధించడంలో ఆయన పాత్ర మరువలేనిదని గుర్తుచేశారు.జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత దిశానిర్దేశంలో బాబుజీ ఆశయాలను సాకారం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పాండురంగా రెడ్డి పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జాగృతి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# పొన్నం పౌండేషన్ సమక్షంలో చలివేంద్రం ప్రారంభం



**పాలకుర్తి, ఏప్రిల్ 05(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పాలకుర్తి మండలం ఈశాల తక్కల్లపల్లి గ్రామంలో ఉమ్మడి రామగుండం మాజీ జెడ్పీటీసీ పొన్నం రామలింగం గౌడ్ స్మారకంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆయన గతంలో కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పనిచేసి సింగిల్ విండో చైర్మన్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ వంటి పదవులు చేపట్టారు. మాజీ ఎంపీ గడ్డం వెంకటస్వామికి నమ్మిన బంటుగా సేవలందించారు.ప్రస్తుతం ఆయన కుమారులు పొన్నం సంతోష్ గౌడ్, పొన్నం సతీష్ గౌడ్ తండ్రి ఆశయాలను కొనసాగిస్తూ పొన్నం పౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వేసవి కాలం దృష్ట్యా ప్రజలకు దాహార్తి తీర్చేందుకు గ్రామంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులు పొన్నం కుటుంబం చేస్తున్న సేవా కార్యక్రమాలపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ ఒడ్నాల జ్యోతి రాజు, వార్డు సభ్యులు, పొన్నం అజయ్, సత్తయ్య, సాయి, బాలసాని సత్తయ్య, పొన్నం శంకరయ్య, వడ్లకొండ గిరిబాబు, దీకొండ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ షాపు తనిఖీ చేసిన సివిల్ సప్లై డిటి -- డీలర్‌పై కేసు

**దేవరకొండ, ఏప్రిల్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నల్లగొండ జిల్లా డిండి మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలోని రేషన్ షాపును డిటి సివిల్ సప్లై అధికారి మోబినోల్ల ఆదివారం తనిఖీ చేశారు.తనిఖీల్లో రేషన్ బియ్యం నిల్వల్లో భారీ వ్యత్యాసం బయటపడడంతో అధికారులు షాపును సీజ్ చేసి, డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేశారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రేషన్ షాపులు నిబంధనలకు అనుగుణంగా నడపాలని, ఉల్లంఘనలకు కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.



## సైదాపూర్, వీణవంక, గంగాధర మండలాల నుండి జాగృతిలోకి భారీ చేరికలు




**కరీంనగర్, ఏప్రిల్ 05 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా జాగృతి అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నాయకత్వంలో ఈ నెల 25న నూతన రాజకీయ పార్టీ ఆవిర్భవించనున్న నేపథ్యంలో జిల్లాలో విస్తృతంగా చేరికలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా జాగృతిలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కవిత నాయకత్వంపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు, మహిళలకు విశ్వాసం పెరిగిందని, రాష్ట్ర భవిష్యత్తు ఆమె చేతుల్లోనే సురక్షితమని అన్నారు. గతంలో బిఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కవిత పోరాటం ప్రజల్లో విశ్వాసాన్ని పెంచిందని పేర్కొన్నారు.నూతన పార్టీ ప్రజల మద్దతుతో అధికారంలోకి వస్తుందని, ఇప్పటికే పెద్ద ఎత్తున చేరికలు జరుగుతున్నాయని, రానున్న రోజుల్లో మరింత విస్తృతంగా జాగృతిలో చేరికలు ఉంటాయని హరిప్రసాద్ తెలిపారు.కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల తిరుపతి, బీసీ విభాగం అధ్యక్షుడు శ్రీరాములు రమేష్, ఆదివాసి విభాగం అధ్యక్షుడు కుతాడు శ్రీనివాస్, సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్, జంగా అపర్ణ, పుల్లూరి అంజలి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ చౌరస్తా వద్ద బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాస్తారోకో



**హుస్నాబాద్, ఏప్రిల్ 05 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాస్తారోకో చేపట్టారు. గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటోను బలవంతంగా ఏర్పాటు చేశారని ఆరోపిస్తూ వారు ఆందోళన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఒక్క ఆర్టీసీ మహిళలకు ఉచిత ప్రయాణం తప్ప మిగతా హామీలు అమలు కాలేదని, కొత్త ఆసరా పెన్షన్ కూడా ఇవ్వలేదని బిఆర్ఎస్ నాయకులు విమర్శించారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎంఏ. అన్వర్, కౌన్సిలర్ గాదెపాక రవీందర్, మాజీ మండల అధ్యక్షుడు వంగ వెంకట్రామిరెడ్డి, నాయకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, పూదరి రవీందర్ గౌడ్, శ్యాంసుందర్ గౌడ్, యాస శ్రీనివాస్, బూర వెంకన్న, బీలు నాయక్, అరవింద్ గౌడ్, లక్ష్మణ్ నాయక్, బోజ్జ హరీష్, కూతాటి విజయభాస్కర్, కన్నోజు రామకృష్ణ, క్రాంతి, దీకొండ ప్రవీణ్, కందుకూరి సతీష్, సంపత్, గుడిశెట్టి సుధాకర్, బత్తుల జగ్జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఆవోప అధ్యక్షుడి సమక్షంలో కార్పొరేటర్లకు ఘన సన్మానం



**కరీంనగర్, ఏప్రిల్ 05 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ స్థానిక కృష్ణనగర్‌లోని ఆవోపా భవనంలో ఆదివారం జిల్లా ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమురవెల్లి వెంకటేశం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరిగింది. నగరపాలక సంస్థ ఆర్యవైశ్య కార్పొరేటర్లు వంగల పవన్, కొలిపాక రమ్యశ్రీ--శ్రీనివాస్, బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపొందిన బండ శివకుమార్, నీరుమళ్ళ సంధ్యారాణి లను ఘనంగా సత్కరించారు.సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ వైశ్యులు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని, ఐక్యమత్యంతో సహకారం అందించుకోవడం ద్వారా బలమైన శక్తిగా ఎదగాలని సూచించారు.కార్యక్రమంలో రాష్ట్ర అవోపా ముఖ్య సలహాదారు గంజి స్వరాజ్యబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి అయిత ఈశ్వర ప్రసాద్, కోశాధికారి కట్కూరి సుధాకర్, ఉపాధ్యక్షులు కొత్త ప్రకాశ్, పబ్బ అరుణ, కొండూరు శ్రీనివాస్, తోడుపనూరు దశరథం, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవం ముందస్తు వేడుకలు

**కరీంనగర్, ఏప్రిల్ 05 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కరీంనగర్ నగర మేయర్ కొలగని శ్రీనివాస్ ఆదివారం తీగలగుట్టపల్లిలోని తన స్వగృహంపై పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1980 ఏప్రిల్ 6న అటల్ బిహారీ వాజ్‌పాయ్ నేతృత్వంలో స్థాపించబడిన బిజెపి నేడు ప్రపంచంలోనే అత్యధిక కార్యకర్తలు కలిగిన పార్టీగా ఎదిగిందని తెలిపారు. నేషన్ ఫస్ట్, పార్టీ నెక్స్ట్, సెల్ఫ్ లాస్ట్ అనే సిద్ధాంతమే బిజెపిని తిరుగులేని శక్తిగా మార్చిందని అన్నారు. ఇద్దరు ఎంపీలతో ప్రారంభమైన బిజెపి నేడు దేశాన్ని ఏలే స్థితికి చేరిందని, వరుసగా మూడుసార్లు కేంద్రంలో



అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. హుజురాబాద్‌లో కూడా జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తన స్వగృహంపై పార్టీ జెండాను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ, బిజెపి కుటుంబ సభ్యులందరికీ 47వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ సేవ, ఆత్మనిర్భర భారత్ లక్ష్యంతో బిజెపి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తోందని, పార్టీ సిద్ధాంతం వల్లే ప్రపంచంలోనే అతిపెద్ద క్యాడర్ ఆధారిత పార్టీగా అవతరించిందని అన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం జాతీయ భద్రత, దేశ అభివృద్ధికి పెద్దపీట వేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు.

# పద్మశాలీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

**కరీంనగర్, ఏప్రిల్ 05 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్‌లో పద్మశాలి జిల్లా సంఘం, సంక్షేమ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో పద్మశాలి కళ్యాణ మండపంలో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ పద్మశాలీలు రాజకీయంగా పూర్తిగా వెనుకబడిన వర్గమని, వారికి తగిన ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు.సమాజంలో సంఖ్యాబలం ఉన్నప్పటికీ చట్టసభల్లో పద్మశాలీలకు సరైన గుర్తింపు లేకపోవడం ఆవేదనకరమని వారు పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ ద్వారా పద్మశాలీలకు రాజకీయంగా




రాణించే అవకాశం లభిస్తుందని, ఐక్యమత్యంతో ముందుకు సాగి రాజకీయ చైతన్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. రాబోయే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో పునర్విభజన వల్ల స్థానాలు పెరిగే అవకాశం ఉందని, వాటిని పద్మశాలీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాజకీయాల్లో ఆసక్తిగల వారు ఇప్పటినుండే ప్రణాళికలు రూపొందించుకోవాలని, ప్రజల ఆదరాభిమానాలు పొందేలా క్షేత్రస్థాయిలో వేదికలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు.పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నియామకాన్ని ప్రభుత్వం వెంటనే చేపట్టాలని, పాలనలో పద్మశాలీలకు ప్రాధాన్యత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఉమ్మడి జిల్లాలో గెలుపొందిన మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఉప సర్పంచులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# ఘనంగా డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి ఉత్సవాలు

**కరీంనగర్ / సిద్దిపేట/ పెద్దపల్లి , ఏప్రిల్ 05(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దేశ మాజీ ఉప ప్రధానమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక న్యాయ సాధనకు జీవితాంతం కృషి చేసిన మహానేత డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి ఉత్సవాలు పెద్దపల్లి, హుస్నాబాద్, కరీంనగర్, సిద్దిపేట జిల్లాల్లో ఘనంగా నిర్వహించారు.పెద్దపల్లిలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి. వేణుతో కలిసి బస్టాండ్ సమీపంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ అంటరానితనం నుంచి ఉప ప్రధాని స్థాయికి ఎదగడం గొప్ప స్ఫూర్తి అని, ఆయన ఆశయాలను మనమంతా ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. అదనపు కలెక్టర్ డి. వేణు ఆయనను బేబీ మినిస్టర్గా పిలిచిన సందర్భాలను గుర్తుచేసి, దేశ రాజకీయాల్లో ఆయన సుదీర్ఘ సేవలను కొనియాడారు.హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఉల్లంపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ అలువాల శంకర్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు, యువత, మహిళలు ఉత్సాహంగా పాల్గొని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ముల్కనూర్ గ్రామంలో సర్పంచ్ సాంబారి భారతమ్మ



కొమురయ్య నేతృత్వంలో నివాళులు అర్పించారు.కరీంనగర్ రూరల్ మండలంలో గాలిపెల్లి కుమార్ విగ్రహానికి పూలమాలలు వేసి, దళితులు అన్ని వర్గాలతో సమానంగా ఎదగడం ద్వారా జగ్జీవన్ రామ్‌కు నిజమైన నివాళి అర్పించినవారమవుతామని అన్నారు. ఆయన కుమార్తె స్పీకర్గా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు.సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బీజీఆర్ చౌరస్తా వద్ద కలెక్టర్ కె. హైమావతి, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డిఆర్ఓ నాగరాజమ్మ, ఆర్డిఓ సదానందం, దళిత సంఘాల నాయకులు బొమ్మల యాదగిరి, బైరి రాజేశం, ఎర్ర మహేందర్, లింగంపల్లి శ్రీనివాస్, బయ్యారం ఇస్తారి పరుశరాములు, డి. శంకర్, భీమసేన ఎల్లేష్, రామస్వామి, చుంచు రమేష్ తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆయన దేశ రాజకీయాల్లో సుదీర్ఘ కాలం విశిష్ట సేవలు అందించి సామాజిక న్యాయ సాధనకు కృషి చేశారని కొనియాడారు.కరీంనగర్‌లో అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారు శేఖర్, కార్పొరేటర్ బోట్ల శ్యామల, తంగేళ్ల కిరణ్ కుమార్ టిల్లు, పార్టీ సభ్యులు బద్రినేత తదితరులు ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా అన్ని వర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సంఘాల నాయకులు పాల్గొని మహనీయుడి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సంకల్పించారు.

## సామాజిక సమానత్వం కోసం పోరాడిన నేత బాబూ జగ్జీవన్ రామ్

-మున్సిపల్ చైర్మన్ సుదర్శన్ రెడ్డి

**ఇబ్రహింపట్నం,ఏప్రిల్ 05 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సామాజిక సమానత్వానికి ప్రతీకగా నిలిచిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్ అని మున్సిపల్ చైర్మన్ సుదర్శన్ రెడ్డి అన్నారు. ఇబ్రహింపట్నం లో బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి ఆదివారం మున్సిపల్ చైర్మన్ సుదర్శన్ రెడ్డి తో కలిసి జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన జిల్లా



గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి . ఈ సంధ్భంగా వారు మాట్లాడుతూ...డా. బాబు జగ్జీవన్ రామ్ దేశ సామాజిక న్యాయం, సమానత్వ సాధనలో చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టి సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహింపట్నం నియోజక వర్గ యువజన విభాగం అధ్యక్షుడు జెర్కోని రాజు , కౌన్సిలర్లు చిలుకల బుగ్గరాములు , గూడూరు గిరి , మంద జయ , కొంద్రు ప్రవీణ్ కుమార్ , దాసరి మురళీకృష్ణ , కొండిగారి త్రిలోక్ కుమార్ , మహేష్ , బిఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి రాజ్ కుమార్ , చిన్నానాయక్ , దీపక్ , తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి ఉత్సవాలు



**కరీంనగర్, ఏప్రిల్ 05 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దేశ మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక న్యాయ సాధనకు జీవితాంతం కృషి చేసిన మహానేత బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి ఉత్సవాలు కరీంనగర్ జిల్లా కేంద్రంతో పాటు గన్నేరువరం, మానకొండూర్ మండలాల్లో ఘనంగా నిర్వహించారు.కరీంనగర్ మంచిర్యాల చౌరస్తా వద్ద కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ జీవితాంతం సామాజిక న్యాయం కోసం పోరాడిన మహనీయుడు అని, 29 ఏళ్లపాటు కేంద్రంలో మంత్రిగా సేవలందించి దేశ సేవే పరమ ధర్మంగా భావించి ఆచరించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మేయర్ కొలగని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు. డిసిసి కార్యాలయంలో కాంగ్రెస్ ఎస్.సి. సెల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మేడిపల్లి సత్యం, వైద్యుల అంజన్ కుమార్, ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, కర్ర రాజశేఖర్ రెడ్డి, ఊట్కూరు నరేందర్ రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఎండి తాజ్, మడుపు మోహన్, పులి ఆంజనేయులు, మల్లికార్జున రాజేందర్, కర్ర సత్య ప్రసన్న రెడ్డి, బానోతు శ్రావణ్ నాయక్, ఎక్కురమ్ సికిందర్, వెన్నం రజిత రెడ్డి, పర్వత మల్లేశం, వరాల నరసింగం, వెల్కపల్లి లచ్చయ్య, కామ్ రెడ్డి రామ్ రెడ్డి, వంగల విద్యాసాగర్, జీడి రమేష్, సలీముద్దీన్, మాదాసు శ్రీనివాస్, నెల్లి నరేష్, స్వప్నశ్రీ, ఊకంటి రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ దళిత సామాజిక కుటుంబంలో జన్మించి ఎంతో కష్టపడి ఉన్నత చదువులు అభ్యసించి ఈ దేశంలో దాదాపు 30 సంవత్సరాల పాటు కేంద్ర రక్షణ శాఖ, వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేసి ఎన్నో సేవలు చేశారని, ఆయన కుమార్తె మీరా కుమార్ లోక్ సభ స్పీకర్‌గా తెలంగాణ రాష్ట్ర బిల్లు పాస్ చేయించడంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు.గన్నేరువరం మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామంలో సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ ఆధ్వర్యంలో, మాదాపూర్ గ్రామంలో సర్పంచ్ మాదరి శ్రీనివాస్ నేతృత్వంలో జయంతి ఉత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మాడుగుల కరుణాకర్ రెడ్డి, గౌడుగు స్వామి, ఆసరి పర్శరాములు, నూనె అంజిరెడ్డి, బాబు తిరుపతి రెడ్డి, మధు, సురేష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.మానకొండూర్ మండల కేంద్రంలో బిజెపి నాయకులు సొన్నాకుల శ్రీనివాస్, భాషబోయిన ప్రదీప్ యాదవ్, మార్కొండ రమేష్ పటేల్, నందగిరి బలరాం, కొండ్ర వరప్రసాద్, ఆరెపల్లి సునంద్ తదితరులు పాల్గొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ దళితుల సంక్షేమం, సమానత్వం కోసం చేసిన కృషి చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## దేశభక్తి, సంస్కృతి, జాతీయతాంశాలపై రచనలు అవసరం

- మంత్రి బండి సంజయ్



**కరీంనగర్, ఏప్రిల్ 05 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
: దేశభక్తి, భారతీయ సంస్కృతి పరిరక్షణ, జాతీయతా ఐక్యతలపై రచయితలు, కవులు మరిన్ని రచనలు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తోందని ఆయన పేర్కొన్నారు.కరీంనగర్‌లో ఆదివారం తన స్వగృహంలో ప్రముఖ కవి, పరిశోధకుడు డా. సబ్బని లక్ష్మీనారాయణ రచించిన చారుధాం యాత్రా చరిత్ర గ్రంథాన్ని బండి సంజయ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రచయితలు, కవులు దేశంలోని వివిధ ప్రాంతాలను పర్యటించి జాతీయ సంస్కృతి అధ్యయనాలపై చక్కటి రచనలు చేయాలని సూచించారు. జాతీయత, సంస్కృతి, దేశభక్తి అంశాలే ప్రధాని మోదీ పరిపాలనకు దారిదీపాలని అభివర్ణించారు.ఉత్తరాఖండ్ హిమాలయాల్లోని ఆధ్యాత్మిక యాత్రలైన చారుధామ్ యాత్రను స్వయంగా పరిశోధించి గ్రంథంగా అచ్చువేసిన డా. సబ్బని లక్ష్మీనారాయణను మంత్రి అభినందించారు.ఈ కార్యక్రమంలో ఇంజనీర్, వాస్తు నిపుణుడు కోల అన్నారెడ్డి, చరిత్రకారుడు సంకేపల్లి నాగేంద్రశర్మ, సామాజిక సేవకుడు ఉప్పల రామేశం, కవి వెలుమల జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మార్క్‌ఫెడ్ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ



**అమ్రాబాద్, మార్చి 05 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బల్మూర్ మండలం తుమ్మన్‌పేట గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సంఘం కొండనాగుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని అచ్చంపేట ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న పంటకు ప్రభుత్వం కనీస మద్దతు ధరగా క్వింటాలుకు రూ.2500 ప్రకటించిందని, అదనంగా రూ.500 బోనస్ ఇస్తున్నదని తెలిపారు. రైతులు ఆరు నెలల కష్టానికి గిట్టుబాటు ధర లభించేలా కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఇలాంటి కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు మద్దతు మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.రైతులు దళారుల మాట వినకుండా మార్క్‌ఫెడ్ ద్వారా మాత్రమే పంటను విక్రయించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, సర్పంచులు, మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## తీసుకున్న అప్పు చెల్లించాలని బాధితురాలి నిరసన




**పెద్దపల్లి, ఏప్రిల్ 05 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి శాంతినగరానికి చెందిన ఒద్దం స్వరూప ఆదివారం తనకు అప్పు తీసుకున్న వారి ఇంటి ముందు ధర్నా చేపట్టింది. అవసరాల నిమిత్తం రెండు సంవత్సరాల క్రితం భార్యాభర్తలు తోడేటి సంధ్య, బాపు తన వద్ద నుండి రూ.43 లక్షలు తీసుకున్నారని, అందులో రూ.20 లక్షలు మాత్రమే చెల్లించారని, మిగతా డబ్బులు అడిగితే దూషిస్తున్నారని ఆమె ఆరోపించింది. రియల్ ఎస్టేట్, బంగారం స్కీం పేరుతో మోసగించారని పేర్కొంటూ పెద్దపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనకు న్యాయం చేసి మిగిలిన డబ్బులు ఇప్పించాలని పోలీసులను స్వరూప వేడుకుంది.

## ఇబ్రహీంపట్నం గడ్డ కాంగ్రెస్ పార్టీ అడ్డా

-రాచర్ల వెంకటేశ్వర్లు



**యాచారం, ఏప్రిల్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికలు అప్రజాస్వామికంగా జరిగాయని యాచారం మండల మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు ఆరోపించారు. యాచారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మస్కు నరసింహ్మ ఆధ్వర్యంలో జరిగిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ కౌన్సిలర్లపై ఉన్న అభియోగాలపై తీర్పు వచ్చే వరకు ఎన్నిక వాయిదా వేయాలని కోరినా అధికారులు పట్టించుకోలేదని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు వాక్‌అవుట్ చేసిన అనంతరం మాజీ ఎమ్మెల్యే తనయుడు ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటీ) చేసిన వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనమని, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి విశేష మెజారిటీ ఇచ్చారని, అభివృద్ధి కార్యక్రమాలు ఎమ్మెల్యే రంగారెడ్డి సారథ్యంలో జరుగుతున్నాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుండ్ల వెంకట్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గులాం అక్బర్, జిల్లా కాంగ్రెస్ ప్రతినిధి వరికుప్పల సుధాకర్, సర్పంచ్‌లు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా ఘన నివాళి

**ఎల్బీనగ్, ఏప్రిల్05( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**



బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతిని పురస్కరించుకొని ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఎల్.బి.నగర్‌లోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ మహోన్నత వ్యక్తిత్వం కలిగినవారని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహానుభావులని తెలిపారు. గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు, పరిపాలన నిపుణుడు అయిన ఆయన జాతీయ నాయకుడిగా, పార్లమెంట్ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా సేవలందిస్తూ అణగారిన తరగతుల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని అన్నారు. ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఆయన విశేషంగా తోడ్పడ్డారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆడాల రమేష్, బి,ఆర్ ,ఎస్ నాయకులు చింతల రవికుమార్, నర్సింహా, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన కాంగ్రెస్ కార్యవర్గానికి ఘన సన్మానం






**అమ్రాబాద్, మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అమ్రాబాద్ మండల కేంద్రంలోని ఎం.కె. గార్డెన్ ఫంక్షన్ హాల్లో నూతనంగా నియమితులైన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎం.ఏ. రహీంను ఆదివారం పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ ఆదేశాలను పాటిస్తూ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో కలసి మండల కాంగ్రెస్ పార్టీని ముందుండి నడిపిస్తానని, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీలో కొత్తగా నియమితులైన కొప్పుల హరి నారాయణ గౌడ్ (జిల్లా ఉపాధ్యక్షుడు), ఎడ్ల ఆనంద్ (జిల్లా కార్యదర్శి)లను కూడా శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిగుర్ల కోటయ్య, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు వెంకటయ్య, మాజీ మండల ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీటీసీలు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## బైకు అదుపుతప్పి యువకునికి తీవ్రగాయాలు..

**యాచారం , ఏప్రిల్ 05( నీలగిరి ఎక్స్ ప్రెస్**



యాచారం మండల కేంద్రంలోని ఆదివారం హెచ్పీ పెట్రోల్ బంక్ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకునికి తీవ్రగాయలు . స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నక్కర్త -మేడిపల్లి గ్రామానికి చెందిన కందుకూరు అరుణ్ కుమార్ తండ్రి యాదయ్య , మేడిపల్లి స్వగ్రామానికి వెళు తుండగా హెచ్పి పెట్రోల్ బంక్ వద్దకు చేరుకోగానే ఒక్కసారిగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 సమాచారం ఇవ్వగా 108 అంబులెన్సులో అరుణ్ కుమార్ ను నగరంలోని ప్రైవేటు హాస్పటల్ కు తరలించారు .. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.